క్లుప్తంగా

'ఐవీఎఫ్' మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్‌గా దైవాధీనం



దైవాధీనంకు నియామకపత్రం ఇస్తున్న రాజమౌళీగుప్తా, శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ స్టేట్ మీడియా కమిటీ చైర్మన్‌గా కోటగిరి దైవాధీనం నియమితులయ్యారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్తా, ఐవీఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా నియామక ఉత్తర్యులను శుక్రవారం నాగోలులో దైవాధీనంకు ప్రదానం చేశారు. ఐవీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్ర శేఖర్, ఐవీఎఫ్ స్టేట్ యూత్ ఉపాధ్యక్షుడు నరేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళ వైద్యానికి సాయం



రమణమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

వనస్థలిపురం: వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ అత్తులూరి మల్లికార్జునరావు శుక్రవారం వాసవి క్లబ్ వనస్థలిపురం ప్రతినిధులతో కలసి వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా పేద మహిళ వుప్పల రమణమ్మకు మెరుగైన వైద్యం నిమిత్తం రూ. 21,500 క్లబ్ ప్రతినిధులతో కలసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సేవా కార్యక్రమాలలో భాగంగా మంత్లీ పెన్షన్ స్కీం కింద ఏడుగురు పేదలకు ఒక్కొక్కరికి రూ. 200 చొప్పున ఇచ్చామన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు అన్నదానం చేశామని తెలిపారు. క్లబ్ జోన్ చైర్మన్ జి.నర్సింహులు, అధ్యక్షుడు శివనాగేశ్వర్‌రావు, కార్యదర్శి అచ్యుతరావు, కోశాధికారి కుమారస్వామి, రమేష్, జగదీశ్, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా..

ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా (ఫైల్)

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ఒకప్పుడు గడ్డిఅన్నారం మున్సిపాలిటీలో ఉండేది. గ్రేటర్‌లో కలిసిన తరువాత డివిజన్ రెండవ కార్పొరేటర్‌గా రంగా నర్సింహ గుప్తా గెలుపొందారు. డివిజన్‌పై సమగ్ర అవగాహన ఉండటంతో సులువుగా సమస్యలను పరిష్కరిస్తూ కాలనీవాసులతో మంచి సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ అధికారుల సహకారంతో సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దటంతోపాటు... ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రంగా నర్సింహ గుప్తా స్పష్టం చేస్తున్నారు. గతంలో మంజూరైన పనులే తాను పదవి చేపట్టిన మొదటి సంవత్సరం జరిగాయన్నారు. పదవి చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నర్సింహ గుప్తాతో 'సాక్షి' ఇంటర్వ్యూ...

ప్రశ్న: గడచిన రెండేళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టారు?

జవాబు: ప్రధానంగా కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలను పరిష్కరించాం. బస్తీ దవాఖానా మంజూరు చేయించాం. పనులు ప్రారంభమైనా... రాజకీయ కారణాలతో నిలిచి పోయింది. కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ నుంచి మూసీ నది వరకు రూ. 7 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఫణిగిరి కాలనీ, ఎంసీహెచ్ కాలనీ, విద్యుత్ నగర్ వరకు రూ. 30 లక్షల వ్యయంతో ఓపెన్ నాలా పై కప్పు నిర్మించాం. రూ. 25 లక్షలతో జైన్ మందిర్ నుంచి చైతన్యపురి డీబీఆర్ లాడ్జ్ వరకు బీటీ రోడ్డు టాప్ వర్కు చేయించాం. సుమారు 350 మందికి వితంతు, ఒంటరి మహిళ, వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లను మంజూరు చేయించాను. భవానీనగర్, ద్వారకాపురి కాలనీ, హనుమాన్‌నగర్, చైతన్యపురి కాలనీలలో రూ. 1.6 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించాము.



ప్రశ్న: భవిష్యత్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు?

జవాబు: నిలిచి పోయిన బస్తీ దవాఖానా భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తా. ఫణిగిరి కాలనీ, న్యూమారుతీనగర్, సత్యనారాయణపురం, ద్వారకాపురి కాలనీ, భవానీనగర్‌లలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని కాలనీలకు నూతన డ్రైనేజీ లైన్లు వేయాల్సిన అవసరం ఉంది. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లకు వినతిపత్రాలు సమర్పించినా వారి నుంచి స్పందన కరువైంది.

ప్రశ్న: ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి?

జవాబు: డ్రైనేజీ, విద్యుత్, రహదారుల మరమ్మతు, పింఛన్ల కోసం వార్డు కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యతాక్రమంలో సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ముఖ్యంగా పలు కాలనీలలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజలు ఫిర్యాదు చేసినా మామూళ్లకు అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కంటి వెలుగు అధికారులతో శుక్రవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు .ఈ సందర్భంగా అధికారులు సెంటర్‌ల వద్ద ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదలకు ఉపయోగపడేలా కేంద్రాలను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు కంటి వెలుగు ద్వారా 80వేల మంది నమోదు చేసుకోగా సుమారు 51 వేల మంది హాజరయ్యారని తెలిపారు. సుమారు 10 వేల మందికి అద్దాలు అందజేయడంతో పాటు 3 వేల మంది అపరేషన్‌లకు సూచించామన్నారు. మరో 10 వేల మంది అద్దాల కోసం ఆర్డర్ చేశామని ఎమ్మెల్యే దేవిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణవేణి, విక్రాంత్‌రెడ్డి, బలరాం పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో హైకోర్టు విజిలెన్స్ బృందం ఆకస్మిక తనిఖీ

రంగారెడ్డి కోర్టులు: హైకోర్టు విజిలెన్స్ బృందం శుక్రవారం రంగారెడ్డి జిల్లా కోర్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ బృందం సభ్యులు తమను ఎవరూ గుర్తుపట్టకుండా ఒక ప్రైవేటు వాహనంలో ఉదయం సుమారు 11 గంటలకు కోర్టు ప్రాంగణంలోకి చేరుకుని మధ్యాహ్నం రెండు గంటల వరకు రహస్యంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం వారు జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరే కృష్ణ భూపతి, న్యాయవాదుల సంఘం ప్రధినిధులతో మాట్లాడారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వాకబు చేశారు. బృందం సభ్యులు వివిధ అంశాలపై సమాచారాన్ని సేకరించి వెనుతిరిగినట్లు విశ్వసనీయ సమాచారం.

వివాహిత అదృశ్యం



శ్రావణి

హస్తినాపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... చింతలకుంటకు చెందిన రావుల శ్రీవాణి(19)కి పగిల్ల మహేశ్‌తో 8 నెలల క్రితం వివాహం జరిగింది. గత నెల 28న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన శ్రీవాణి తిరిగిరాలేదు. కంగారు భర్త మహేశ్ ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేదు. దీంతో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సిలిండర్లు చేతబట్టి బీఆర్‌ఎస్ నేతల భిక్షాటన



ఐఎస్‌సదన్‌లో భిక్షాటనతో నిరసన తెలుపుతున్న సామ స్వప్నాసుందర్‌రెడ్డి

సైదాబాద్: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించాలని బీఆర్‌ఎస్ యాకత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ల ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం అయన డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, పార్టీ నాయకులతో కలిసి ఐఎస్‌సదన్ చౌరస్తాలో బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. అనంతరం వారు సిలిండర్లు చేతులో పట్టుకొని ప్రజలు గ్యాస్ సిలిండర్లు కొనలేని పరిస్థితిలో ఉన్నారని చెపుతూ చౌరస్తాలోని దుకాణాల వద్ద భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ... పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదల జీవనాన్ని ఇబ్బందులపాలు చేసిన ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పుడు గ్యాస్ ధరలను పెంచి ప్రజలను మరింత అన్యాయానికి గురి చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు తగ్గించే వరకు పేదల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోజెస్, ప్రవీణ్, సద్దాం, విక్రం, చందూనాయక్ పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్' నమోదు ప్రారంభం



నమోదును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ వార్డు కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్ నమోదును శుక్రవారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఆయుష్మాన్ భారత్ పథకం కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. అయితే బీజేపీని ప్రజలు ఎక్కడ ఆదరిస్తారో అని భయపడే తెలంగాణ ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేసిందని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవటంతో ఇప్పుడు రాష్ట్రంలో అమలుకు అంగీకరించిందని స్పష్టం చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారందరూ ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కార్పొరేటర్ కోరారు. ఈ పథకం లబ్ధిదారులకు ప్రయివేటు ఆస్పత్రుల్లో ఎక్కడైనా రూ. 5 లక్షల వరకు ఉచితంగా చికిత్సలు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు చిలుకూరి రాంరెడ్డి, కేశవ్ నాయక్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జయప్రకాష్, మహిళామోర్చా అధ్యక్షురాలు కొండూరు రాజేశ్వరి, మైనారిటీ మోర్చా నాయకుడు షేక్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమోట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 35, బీర 40, క్యాలీఫ్లవర్ 21, క్యాబేజీ 9, కారెట్ 15, దొండ 40, ఆలు 16, ఉల్లి 16, గోకర 40, దోస 45, సొర 11, పొట్ల 18, అరటి 9, చిక్కుడు 40, అర్వి 70, మునగ 45, చిలగడదుంప 40, బీట్‌రూట్ 15 కీర 20, ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆస్తి పన్ను చెల్లించాలని ఆదేశం

చంచల్‌గూడ: పాత బస్తీలోని మాదన్నపేట కూరగాయల మార్కెట్ దయానంద్ వెజిటబుల్ మార్కెట్ వారు 8 వారాల్లో ఆస్తి పన్ను చెల్లించాలంటూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలివీ... దయానంద్ వెజిటబుల్ మార్కెట్ వారు జీహెచ్ఎంసీకి రూ. 12 లక్షల ఆస్తి పన్ను బకాయి పడ్డారు. చెల్లించాలని సూచిస్తున్నా కమిటీ వారు స్పందించకపోవడంతో అధికారులు మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న వారి పేరున ఆస్తి పన్ను చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. దీంతో దయానంద్ వెజిటబుల్ మార్కెట్ తరపున కె. అనితరెడ్డి జీహెచ్ఎంసీ అధికారులను ప్రతివాదులుగా చేరుస్తూ హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన కోర్టు పిటిషనర్ కె.అనితారెడ్డి 8 వారాల లోపు 50 శాతం ఆస్తి పన్ను చెల్లించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఘనంగా అన్వరానంద బాబా ఆరాధనోత్సవం

వనస్థలిపురం: శ్రీ సద్గురు భం అన్వరానంద బాబా ఆరాధనోత్సవాన్ని శుక్రవారం వనస్థలిపురంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధి బద్దం వినోద్‌రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కారు ప్రమాద బాధితుడి గుర్తింపు

నాగోలు: వేగంగా వచ్చిన కారు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్న సంఘటనలో ఆ వ్యక్తి గాయపడ్డాడు. ఆ వ్యక్తి గాంధీ హాస్పిటల్ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలిడీ... కుషాయిగూడ నాగారంకు చెందిన జైబాబు(50) నాగోలులోని రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం నాగోలులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రోడ్డు పక్క నుంచి సెల్ ఫోన్ చూసుకుంటూ నాగోలు మెయిన్ రోడ్డు వైపు నడుస్తున్నాడు. అదే సమయంలో నాగోలు రాజ్యలక్ష్మి కాలనీ సమీపంలో ఉండే ఇద్దరు మహిళలు హాస్పిటల్‌కు వెళ్లి తిరిగి కారులో జైపురి కాలనీ వైపు వేగంగా కారు దూసుకొచ్చి జైబాబును ఢీకొట్టడంతో అతడు గాల్లోకి ఎగిరి దూరంగా తల్లకిందులగా పడిపోయాడు. గాయపడిన ఆయనను 108 అంబులెన్సులో గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదంలో జైబాబుకు స్వల్పంగా గాయాలైనట్లు తెలిసింది. జైబాబు గాంధీ హాస్పిటల్ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాద దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. కారులో ఇద్దరు మహిళలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. ప్రమాద ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి వివరించారు.

ఎల్‌బీనగర్ ఫ్లై ఓవర్‌ను వెంటనే ప్రారంభించాలి

లేకుంటే మేమే ప్రారంభిస్తాం: కాంగ్రెస్

లింగోజిగూడ: ఎల్‌బీనగర్‌లో నిర్మాణం పూర్తయిన ఫ్లై ఓవర్‌ను వెంటనే ప్రారంభించాలని లేకుంటే మాల్ మైసమ్మ సాక్షిగా తామే ప్రారంభిస్తామని కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఇంచార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులతో కలసి వారు ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2013లో కాంగ్రెస్ హయాంలో నగరంలో ఫ్లై ఓవర్‌లు మంజూరైతే వాటిని నిర్మించడానికి ఈ ప్రభుత్వానికి సుమారు దశాబ్దకాలం పట్టిందన్నారు. పనులు పూర్తయినా ఫ్లై ఓవర్‌ను ప్రారంభించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సోమవారం సాయంత్రం వరకు ఫ్లై ఓవర్‌కు అడ్డుగా ఉన్న భారీ గేట్స్ తొలగించి ఫ్లైవర్‌పైకి వాహనాలను అనుమతించకుంటే మంగళవారం తామే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లారపు శ్రీనివాస్, బుడ్డ సత్యనారాయణ, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌నగర్‌లో రోడ్డు విస్తరణను ఆపేయండి

- ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు ప్రజల వినతి
- ప్రత్యామ్నాయ మార్గాన్ని చూడాలని అధికారులకు బలాల ఆదేశం



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్ ఆనంద్‌నగర్ కాలనీ రోడ్డు విస్తరణ పనుల ఆపేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే అహ్మద్ బలాలను పంజేషాలోని కార్యాలయంలో కలిసి విన్నవించారు. మలక్‌పేట రైస్ మిల్లర్స్ రోడ్ నుంచి ఆనంద్‌నగర్ మీదుగా చంచల్‌గూడ వైపు ట్రాఫిక్ మళ్లించడానికి రోడ్డు విస్తరణ చేపట్టాలని 2016లో ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. విస్తరణ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్డు విస్తరణ కోసం ఇటీవల మార్కింగ్ చేసి 46 మంది కాలనీవాసులు నోటీసులు అందజేశారు. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. రోడ్డు విస్తరిస్తే మధ్య తరగతికి చెందిన 60 ఇండ్లవారు నష్టపోయి రోడ్డున పడతారని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఆనంద్‌నగర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, కాలనీవాసులతో కలిసి సమావేశయ్యారు. రూట్ మ్యాప్ పరిశీలించి రోడ్డు విస్తరణపై చర్చించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన మార్గంలో కాకుండా.. మలక్‌పేట సూపర్‌బజార్ నుంచి ముంతాజ్ కాలేజ్ మీదుగా గవర్నమెంట్ ప్రెస్‌కు చేరుకునేలా రోడ్డు విస్తరణ చేపట్టాలని, దీంతో ఇండ్లు కోల్పోయేవారు తక్కువగా ఉంటారని, ప్రభుత్వ భూమిలో వెళ్తుందని చెప్పారు. నష్టం జరగకుండా చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు విస్తరణకు ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాలని ఎమ్మెల్యే టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అబ్దుల్ ఫహీమ్ తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ప్రకాశ్, కాలనీ నేతలు నాగరాజుగౌడ్, బబిత, కుల్‌దీప్, తన్వీర్, రాజేష్, శాంతిశ్రీ, లక్ష్మి, హైమా, జి.శ్రీనివాస్, రామకృష్ణ, జె.కిషోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన బంధు'ను అమలు చేయాలి

నాగోలు: తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా రంగారెడ్డి జిల్లా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, ఆర్.పాండునాయక్, ఈశ్వరనాయక్, మూడావత్ గోపి నాయక్, సభావత్ చందు నాయక్, నాయకురాలు నేనావత్ పార్వతి రంగారెడ్డి జిల్లా నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడలో జరిగిన తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభలో రాష్ట్ర కమిటీకి వారు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగోలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని, గిరిజన బంధు పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఉంటున్న గిరిజనులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇండ్లు కట్టు కోవడానికి రూ. 5 లక్షలు కేటాంచాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గిరిజన యువకులను నిరుద్యోగ భృతి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వేతన సవరణ అమలు చేయాలి

తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ డిమాండ్

హుడాకాంప్లెక్స్: వేతన సవరణ అమలు చేయాలని లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన నేపథ్యంలో 7వ రోజు శుక్రవారం భోజన విరామ సమయంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో యూనియన్ ప్రతినిధులు, సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్రలు, బీరు సీసాలతో దాడి: యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన మహేష్

హయత్‌నగర్: పాత కక్ష్యల నేపథ్యంలో స్నేహితులు ఓ యువకుడికి మద్యం తాగించి బీరు సీసాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం... ఎల్‌బీనగర్ భరత్‌నగర్‌కు చెందిన బొడ్డు చంద్రమ్మ కొడుకు మహేష్‌యాదవ్(27)ను ఈ నెల 1న స్నేహితులు పురుషోత్తం, రాముతో పాటు మరికొంత మంది స్నేహితులు ఓ పెళ్లికి వెళ్లారు. గతంలో ఉన్న మనస్పర్థలు పక్కన పెట్టి స్నేహంగా ఉందామని చెప్పి మద్యం తాగేందుకు పిలిచారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండలం తట్టిఅన్నారంలోని శివగంగ బార్‌లో మద్యం సేవించారు. గతంలో ఉన్న తగాదాల కారణంగా మహేష్‌ను పక్కకు తీసుకెళ్లి కర్రలు, బీరు సీసాలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మహేష్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. చెవి దగ్గర తీవ్రంగా గాయరిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే సంఘటన జరిగి రెండు రోజులు కావస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

మహిళ బ్యాగులోని గొలుసు చోరీ

నాగోలు: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారు గొలుసు చోరీకి గురైంది. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వనస్థలిపురానికి చెందిన నీల ఆండాలు(63) తన భర్త విద్యాసాగర్‌తో కలిసి గురువారం వనస్థలిపురం నుంచి నాగోల్ మెట్రో స్టేషన్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. మార్గమధ్యలో ఆండాళు మెడలోని పుస్తెల తాడు కిందపడిపోయింది. గమనించిన ఆమె కిందపడిన పుస్తెలతాడును తీసుకుని తన హ్యాండ్ బ్యాంక్‌లో పెట్టుకుంది. నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద బస్సు దిగిన తర్వాత బ్యాగును పరిశీలించగా పుస్తెల తాడు కనిపించలేదు. బస్సులో తన పక్కనే కూర్చున్న ఓ మహిళపై అనుమానంతో ఆండాళు దంపతులు శుక్రవారం రాత్రి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారి కుమారుడు మల్లికార్జున్ తెలిపారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ దొంగలు

చంచల్‌గూడ: రద్దీ ప్రాంతాల్లో ప్రజల నుంచి మొబైల్ ఫోన్లు దొంగలిస్తున్న ఇద్దరిని స్థానికుల యువకులు పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. వివరాలివీ... కుర్మగూడ డివిజన్ మాదన్నపేట మార్కెట్‌లో కూరగాయల కొనుగోలు చేసేందుకు వస్తున్న వారిని నుంచి చాకచక్యంగా మొబైల్ ఫోన్లు దొంగలిస్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులను మార్కెట్‌లో పనిచేసే యువకులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులను మాదన్నపేట పోలీసులకు అప్పగించారు. వారి నుంచి 3 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా రాజశ్యామల వారాహి హోమం



పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి దంపతులు

హస్తినాపురం: డిఫెన్స్ కాలనీలోని శ్రీహరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉదయం రాజశ్యామల వారాహి హోమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్ రెడ్డి దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జగద్గురువులు హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి మహాసంస్థాన పరిపాలిత వారి అనుగ్రహంతో బ్రహ్మశ్రీ కొడకొండ్ల శ్రీరామశరన్ శర్మ గురూజీ హిందూ ధర్మం జ్యోతిష్యులు చాముండేశ్వరీ గురుదత్త పీఠం వ్యవస్థాపకులు, మైసూర్ దత్తపీఠం ఆస్థాన విద్వాంసులు ఆచార్యబ్రహ్మత్వంలో శ్రీరమణగురుస్వామి, రాజేశ్‌పాండే పర్యవేక్షణలో పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, లంకల రమేశ్‌రెడ్డి, మిరియాల అంజయ్యగుప్తా, లింగాల దశరథగౌడ్, సుంకరి రమేశ్‌గౌడ్, విఘ్నేశ్వరరెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కేశవరెడ్డి, సూర్యప్రకాశ్‌గుప్తా, భిక్షపతిగౌడ్, వంగ ప్రవీణ్ రెడ్డి, మణిపాల్‌రెడ్డి, శివరాంరెడ్డి, హరీష్‌రెడ్డి ముత్యాల వీరారెడ్డి, హరికృష్ణ, నిర్మలేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.